జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక


మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 20-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 706 పేజీలు: 4 వెల : రూ.7

# అవినీతి తిమింగలాల గుండెల్లో.. గుభేల్

* ఒకేసారి మూడు కీలక జీవోలు జారీ
* టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతిపై విచారణాధికారి నియామకం



శ్రీకాకుళం, జూన్19 (వార్త): శ్రీకాకుళం జిల్లా అవినీతి నిరోధక, రెవెన్యూ విభాగాల్లో సంచలన పరిణామాలు చోటుచేసుకున్నాయి. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, ఏసీబీ దాడుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా మూడు కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పరిణామాలతో జిల్లాలోని అవినీతి, అలసత్వ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆయా కేసుల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై జరిగిన ఏసీబీ దాడి కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2018 ఏప్రిల్ 26న నమ్మకమైన సమాచారంతో ఏసీబీ అధికారులు ఈ కార్యాలయంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు అక్రమాలను గుర్తించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురు అధికారులపై క్రమశిక్షణా చర్యల నిమిత్తం అప్పట్లో ట్రిబ్యునల్‌కు అప్పగించారు. అయితే, ఈ ట్రిబ్యునల్ రద్దు కావడంతో కేసు కమిషనరేట్ ఆఫ్ ఇంక్వైరీస్‌కు బదిలీ అయింది. ఈ సుదీర్ఘ ప్రక్రియలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సానపల వేణు (30.04.2020న రిటైర్డ్), సీనియర్ అసిస్టెంట్ ఉరిటి భవానీ శంకర నారాయణ (31.08.2021న రిటైర్డ్)లపై నిర్ణీత 4 ఏళ్ల కాలపరిమితిలోగా ఛార్జీలు ఫ్రేమ్ చేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రివైజ్డ్ పెన్షన్ రూల్స్, 1980 ప్రకారం వారిపై తదుపరి చర్యలను ప్రభుత్వం డ్రాప్ చేసింది. కాని, మిగిలిన ముగ్గురు నిందితులైన కప్పగంతుల రామకృష్ణ (సీనియర్ అసిస్టెంట్), గొడాయి రఘురామ్ పాండా (సీనియర్ అసిస్టెంట్), సవర సూరయ్య (ఆఫీస్ సబార్డినేట్) సమర్పించిన వివరణలు సంతృప్తికరంగా లేకపోవడంతో ప్రభుత్వం ఉమ్మడి క్రమశిక్షణా చర్యలకు ఆదేశించింది. ఈ ముగ్గురిపై విచారణాధికారిగా విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రార్‌ను నియమిస్తూ రెవెన్యూ (విజిలెన్స్-2) శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ జీవో ఆర్టీ నెం. 1037 జారీ చేశారు. ఈ విచారణను 90 రోజుల్లోగా పూర్తి చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శ్రీకాకుళం మండలానికి చెందిన ఓ ఏసీబీ ట్రాప్ కేసులో నిందితులుగా ఉన్న రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం తీసుకున్న విచారణా చర్యలను ముగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వార్డు రెవెన్యూ సెక్రటరీ ముద్దాడ జయకృష్ణ బాలాజీ, మాజీ ఎంఆర్ఐ/డెప్యూటీ తహసీల్దార్ ఎస్. శంకరరావు, తహసీల్దార్ ఎన్. వెంకటరావులపై ఏసీబీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఉమ్మడి క్రమశిక్షణా విచారణ చేపట్టింది. ఈ కేసుపై శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణాధికారిగా వ్యవహరించి ఈ ఏడాది జనవరి 27న ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అనంతరం నిందితులు ఇచ్చిన వివరణలను, పూర్తి రికార్డులను పరిశీలించిన ప్రభుత్వం, సదరు అధికారులపై తదుపరి చర్యలను పూర్తిగా డ్రాప్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రెవెన్యూ (విజిలెన్స్-3) శాఖ జీవో ఆర్టీ నెం. 1056 విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సర్కిల్‌లో గతంలో పనిచేసి, ప్రస్తుతం వీఅండ్ఈ విభాగంలో ఉన్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్. రవిప్రసాద్‌పై విధించిన 'సెన్సూర్' శిక్షను ప్రభుత్వం రద్దు చేసింది. మెలియాపుట్టి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై విశాఖపట్నం రేంజ్ డీఐజీ మొదట ఆయనకు ఒక ఏడాది పాటు ప్రమోషన్, ఇంక్రిమెంట్లపై ప్రభావం చూపేలా శిక్ష విధించారు. దీనిపై ఆయన డీజీపీకి అప్పీల్ చేసుకోగా, డీజీపీ ఆ శిక్షను "సెన్సూర్" (మందలింపు)గా మార్చారు. అయితే, దీనిపై రవిప్రసాద్ ప్రభుత్వం వద్ద రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా, మెటీరియల్ రికార్డులను పరిశీలించిన ప్రభుత్వం ఆ సెన్సూర్ శిక్షను కూడా పూర్తిగా రద్దు చేస్తూ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ జీవో ఆర్టీ నెం. 802 జారీ చేశారు.

# క్షణికావేశం!

* ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి రైలు కింద పడి బలవన్మరణం
* పలాస రైల్వే స్టేషన్ సమీపంలో విషాద ఘటన
* కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు
* శోకసంద్రంలో చలమయ్యపేట

## మూడు నిండు ప్రాణాలు బలి



పలాస, జూన్ 19 (వార్త): క్షణికావేశం.. ముగ్గురు ప్రాణాలను బలిగొంది. ఆ తల్లికి ఏం కష్టమొచ్చిందో గాని.. ఒక్క క్షణం ఆలోచించి ఉంటే.. పిల్లల భవిష్యత్‌పై మరోసారి ఆలోచన చేసి ఉంటే.. ఇటువంటి నిర్ణయానికి వచ్చేది కాదేమో.. నవమోసాలు మోసి కనిపెంచిన తల్లే.. చిన్న చిన్న ఘటనలకు తలకుమించి ఆలోచన చేస్తూ చివరికి పిల్లల ప్రాణాలు తీసి.. ఆమె కూడా ప్రాణాలు తీసేసుకుంది. ఓ తల్లి ఇద్దరు చిన్నారులతో కలిసి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడిన హృదయ విదారక ఘటన పలాస రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. మృతులు కోటబొమ్మాళి మండలం తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట గ్రామానికి చెందిన గేదెల పూజిత (35), ఆమె కుమారుడు కుశాంత్ (8), కుమార్తె దీక్షిత (6)గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కోటబొమ్మాళి ఎస్ఐ వంగపండు సత్యనారాయణ వారి నివాసానికి వెళ్లి ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గేదెల పాపమ్మ కుమారుడు వెంకటి, కోడలు పూజిత, వారి పిల్లలు కుశాంత్, దీక్షితతో కలిసి గత కొంతకాలంగా కుటుంబ పోషణ నిమిత్తం విజయవాడలో నివసిస్తున్నారు. ఇటీవల పిల్లలకు వేసవి సెలవులు రావడంతో స్వగ్రామమైన చలమయ్యపేటకు వచ్చారు. ఈ క్రమంలో వెంకటి తల్లి పాపమ్మ అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. తాను పనుల నిమిత్తం విజయవాడకు వెళ్లి వస్తానని, ఇంటి వద్ద ఉండి తన తల్లిని చూసుకోవాలని వెంకటి భార్య పూజితకు చెప్పాడు. తాను గ్రామంలో ఉండలేనని, విజయవాడకు వచ్చేస్తానని పూజిత భర్తకు ఫోన్‌లో తెలిపింది. ఈ విషయంలో దంపతుల మధ్య మాటాల పట్టింపులతో మాటామాటా పెరిగింది. పూజిత తన పుట్టింటి గ్రామమైన భావనపాడుకు వెళ్తానని చెప్పి గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని చలమయ్యపేట నుంచి బయలుదేరింది. ఈ విషయాన్ని వెంకటి తన అత్త అన్నపూర్ణకు తెలియజేయగా, కుమార్తె, మనవళ్లు ఇంటికి రాలేదని ఆమె తెలిపింది. అనంతరం గురువారం సాయంత్రం అన్నపూర్ణ కుటుంబ సభ్యులతో కలిసి చలమయ్యపేటకు వచ్చి, పూజిత, పిల్లల ఆచూకీ కోసం గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు. భావనపాడుకు వెళ్తానని చెప్పి బయలుదేరిన పూజిత, ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రంతా పిల్లలతో రైల్వే స్టేషన్‌లో గడిపి ఆమె, శుక్రవారం ఉదయం ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది. ఇద్దరు పిల్లలతో కలిసి పూజిత మృతి చెందిన వార్త శుక్రవారం ఉదయం గ్రామంలో దావానంలా వ్యాపించింది. ఎప్పుడూ అందరితో కలిసిమెలిసి ఉండే ఆ తల్లి, పిల్లలు ఒక్కసారిగా మృతిచెందారన్న వార్తను కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఆర్ఐపీ కరెంట్, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



**ఎచ్చెర్ల, జూన్ 19 (వార్త):** ఎస్ఎస్ఆర్ పురం హైస్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆర్ఐపీ కరెంట్, డ్రగ్స్ నియంత్రణపై ఎస్ఐ జి.హరికృష్ణ రావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఐపీ కరెంట్ వచ్చే సమయములో సముద్రపు రంగు మారుతుందో వివరించారు. ఆ సమయంలో తీసుకోవాల్సిన మెళకువలను తెలిపారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. మహిళలు, బాలికలపై జరుగు తున్న దౌర్జన్యాలు, పోక్సో చట్టం గూర్చి తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగం గూర్చి సమాచారం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 లేదా కళింగపట్నం ఎస్.హెచ్.ఓ. వారి నెంబర్ 9392914712 కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యా యురాలు టి.జయలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నారీశక్తితో మహిళలకు రక్షణ



**పలాస, జూన్ 19 (వార్త):** నారి శక్తి, ఫోక్సో చట్టము, రోడ్ సేఫ్టీ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ అవగాహన కల్పించారు. శుక్రవారం రామక్రిష్ణపురములో శ్రీ సత్యసాయి విద్యావిహార్లో చదువుతున్న 8,9,10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఏపీ పోలీసు శక్తి ఎప్, పోక్సో చట్టము, రోడ్ సేఫ్టీ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ఆయా యాక్ట్ ల సంబంధిత పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల భద్రత, సంరక్షణే లక్ష్యంగా "గుడ్ టచ్ - బ్యాడ్ టచ్" వంటి సున్నితమైన అంశంపై పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించిన అవగాహన వీడియో సామాజిక మాధ్యమాల్లో విశేష ఆదరణ పొందుతోందని వివరించారు. మైనర్ బాలికలపై అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫోక్సో చట్టము అమలు జరుగుతుందని శక్తి టీం అధికారులు వివరించారు. లైంగిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుందని, పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం ద్వారా లైంగిక వేధింపులను అరికట్టాలని ఆయన అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాలికలపై వేధింపులు, దోపిడీ, హింస వంటి సంఘటనలను గుర్తిస్తే చైల్డ్ లైన్ 1098, పోలీసు 100, ఉమెన్ హెల్ప్లైన్ 181 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే తక్షణమే స్పందించి తగు రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్ ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, కానిస్టేబుల్ వాసు, ఉపాధ్యాయులు విద్యార్థినీ.. విద్యార్థులు పాల్గొన్నారు.




# ఆయుష్మాన్ భారత్‌లో చేరండి

**పలాస, జూన్ 19 (వార్త):** ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ అప్లికేషన్‌పై అవగాహన, ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన అధ్యాపకులు, విద్యార్థిని--విద్యార్థులకు ఆాదీనాా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) అప్లికేషన్‌పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, హరిజన వీధి, పలాస సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు తమ ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో భద్రపరచుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ అప్లికేషన్ ద్వారా ఆరోగ్య సమాచారాన్ని సురక్షితంగా నిర్వహించుకోవచ్చని, చికిత్స సమయంలో పత్రాలను పదేపదే తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని వివరించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలలో ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ ఈ. దివాకర్ మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ భారత ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్లో భాగంగా రూపొందించిన ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్య అని వివరించారు. ఈ పథకం కింద ప్రతి వ్యక్తికి 14 అంకెల ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు సంఖ్య కేటాయించబడుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ యొక్క అధికారిక వెబ్‌సైట్, నమోదు విధానం, ఉపయోగాలు, ప్రయోజనాలను సవివరంగా వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకుల మొబైల్ ఫోన్లలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసి నమోదు ప్రక్రియను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి. నరసింహులు, డాక్టర్ వై. వెంకటలక్ష్మి, కె.గిరిజ, ఎ. సునీత, ఆర్. దీపకుమారి, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది ఏఎన్ఎంలు బి. వాణిశ్రీ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ పుట్టినరోజు వేడుకలు



**పలాస, జూన్ 19 (వార్త):** లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తన 55వ పుట్టినరోజు వేడుకను పలాస నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శుక్రవారం నిర్వహించారు. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇటీవల పహల్గామ్ ఉగ్రవాద దాడి, అహ్మదా బాద్ విమాన ప్రమాదం, తన తల్లి సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరిన కారణంగా రాహుల్ గాంధీ వేడుకలకు దూరంగా ఉన్నారని తెలిపారు.

దేశవ్యాప్తంగా, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాయి. భారత దేశా ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు ప్రాణాలు సహితం త్యాగం చేసిన కుటుంబం, ఇందిరా కుటుంబం వంటి గొప్ప కుటుంబంలో పుట్టిన యువనాయకుడు, ప్రజా యోగక్షేమ దృశ్య అనుక్షణం ప్రతిపక్ష నాయకుడిగా పోరాడి భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగపు శాసనాలని, ప్రజల ప్రయోజన రక్షణ కొరకు అలుపెరుగక పోరాడు తున్నటు వంటి రాహుల్ గాంధీ 55 వ పుట్టినరోజు సందర్భంగా పలాసలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచారు. ఎల్లవేళ సుఖంగా ఉండాలని కోరుకుంటూ ప్రార్థనలు చేశారు. పీసీసీ అధ్యక్షులు వై.ఎస్. షర్మిలా రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి తెంబూరి మధుసూదనరావు, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ దళిత విభాగ పలాస పట్టణ అధ్యక్షులు తంగుడు రమణయ్య, నియోజకవర్గం చెందిన యువ నాయకులు జన, తంగుడు సత్యం తదితర నాయకులు పాల్గొన్నారు.

# సేవలను ప్రైవేటీకరించే జి.ఓ.లను రద్దు చేయాలి




**పలాస, జూన్ 19 (వార్త):** మున్సిపాలిటీలో పౌర సేవలను పి.పి.పి (పీపీపీ) పద్ధతిలో ప్రైవేటీ కరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జి.ఓ.లు 975, 673లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలాస మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్. గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వెంకటి, బి. కుర్మారావు మాట్లాడుతూ శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో ప్రైవేటు విధానాలను ప్రవేశపెట్టడం వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల వేలాది మంది కార్మికులు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లు చేశారు. ప్రైవేటీకరణ జి.ఓ.లను వెంటనే ఉపసంహరించుకోవాలని, 2016 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 2018 హైకోర్టు ఆదేశాల ( డబ్ల్యూ పి . నెం. 44902, 31806, ఙ 45705) ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. 2011-12 సంవత్సరానికి సంబంధించిన 20 నెలల పి.ఎఫ్. సొమ్మును కార్మికుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు.

2024లో జరిగిన సమ్మె కాలానికి సంబంధించిన ఏడు రోజుల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ?ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్. మురగన్, కె. ఈశ్వరరావు, అమర్, కె.బాలు, భాస్కర్, తిరుపతి, సావిత్రి, గులాబీ, భాను, లక్ష్మి తదితర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల పరిశీలన పారదర్శకంగా ఉండాలి

**సోంపేట, జూన్ 19(వార్త):** సర్ ప్రక్రియలో భాగంగా బిఎల్వోలు చేపడుతున్న ఓటర్ల పరిశీలన అత్యంత పారదర్శకంగా ఉండాలని ఇచ్చాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన స్థానిక వైసీపీ నాయకులతో కలిసి శుక్రవారం పట్టణంలోని ఎనిమిదవ వార్డు బూత్ నెంబర్ 231 పరిధిలో ఈ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓలతో మాట్లాడుతూ ప్రతి ఓటర్కు అన్యుమరేషన్ ఫారంతో పాటు అక్నోలడ్జిమెంట్ కాపీ అందించాలని సూచించారు. అనంతరం తాసిల్దార్ అప్పలస్వామి తో కలసి సర్ ప్రక్రియను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు సిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ,సునీల్ త్రిపాటి, టెంక మణికంఠ,డోకి రుషి, సోమిరెడ్డి మణికంఠ,పొందర ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.



# వాడవాడలా డ్రైడే.. ఫ్రైడే



**పలాస, జూన్ 19 (వార్త):** కలెక్టర్ ఆదేశాల మేరకు బంటు కొత్తూరు గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది సహకారంతో "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించిన నేపథ్యంలో శుక్రవారం పలాస మండలం బంటు కొత్తూరు సచివాలయ పరిధిలోని బంటు కొత్తూరు గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, వాటర్ ట్యాంకులు, నీటి నిల్వ పాత్రలను శుభ్రంగా ఉంచడం, దోమల వ్యాప్తిని నివారించే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠ రావు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, సీవీఎపి యూనిట్ సిబ్బంది , యంగ్ ప్రొఫెషనల్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొని గ్రామ ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని అధికారులు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు కవిటిలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ



**సోంపేట, జూన్ 19(వార్త):** కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కవిట్లో గల ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ క్యాంపు కార్యాలయం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు విజయోత్సవ సభ తో పాటు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోంపేట మండలం టిడిపి అధ్యక్షుడు మద్దు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల అన్ని గ్రామాల నుంచి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులు, అభిమానులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

# అంగరంగ వైభవంగా శ్రీధర్ జన్మదిన వేడుకలు

**-ఉద్దానం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు**

**-పలాస జిల్లా సాధనకు ఉద్యమం ఉధృతం చేస్తామన్న శ్రీధర్**

**-ఎన్నికల వాతావరణం తలపించిన దువ్వాడ నివాసం**

**- రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజా సంఘాల డిమాండ్**



**పలాస, జూన్ 19 (వార్త):** ప్రముఖ సామాజిక వేత్త, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ బాబా పుట్టినరోజు వేడుకలు శుక్రవారం పలాసలోని ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నలుమూలల నుంచి వేలాదిమంది అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ ఏడాది పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని శ్రీధర్ నిర్ణయించుకున్నప్పటికీ, సమీప అనుచరులైన కూన హేమచలం, దువ్వాడ నవీన్ చౌదరి నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహించారు . తౌలుత శివాజీ నగర్‌లోని షిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రజా సంఘాల నేతలు, వైఎస్ఆర్సీపీ శ్రేణులు, యువత, మహిళల సమక్షంలో శ్రీధర్ కేక్ కటింగ్ చేశారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు శుభాకాంక్షలు తెలిపేందుకు జనం బారులు తీరారు. ఈ సందర్భంగా వేలాదిమందికి విందు భోజనం ఏర్పాటు చేశారు. 'దువ్వాడ నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ యువత పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో దువ్వాడ నివాసం ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. పలు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పలాస ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న శ్రీధర్ నాయకత్వం ప్రస్తుత రాజకీయాల్లో అవసరమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పలాస నుంచి శ్రీధర్ పోటీ చేస్తే రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.

దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ, తమ కుటుంబంపై ఉద్దానం ప్రజలు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు తగిన కార్యాచరణ చేపడతానని చెప్పారు. పలాస జిల్లా సాధనే ప్రధాన లక్ష్యంగా భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అభ్యుదయ శక్తులను కలుపుకొని ముందుకు సాగుతామని ప్రకటించారు. శుభాకాంక్షలు తెలిపేందుకు పలాస పట్టణ ప్రముఖ వాణిజ్య, వ్యాపారవేత్తలు, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాలు, ఆటో డ్రైవర్ యూనియన్, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, జీడి కార్మిక సంఘాల నాయకులు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు భారీగా హాజరయ్యారు.

## యోగాతో మానసిక ప్రశాంతత




**ఇచ్ఛాపురం, జూన్ 19(వార్త):** ప్రభుత్వ డిగ్రీ, కళశాల, ఇచ్ఛాపురం ఎన్ ఎస్ ఎస్ విభాగం అద్వరంలో యోగా పై తరగతులు నిర్వహించారు. ఈ కారకమంలో ప్రిన్స్ పాల్ డాక్టర్ కృష్ణ విద్యార్థిని విద్యార్థులకు జీవితంలో యోగా ప్రాధానత గురుంచి వివరించారు, జీవన శైలి లో యోగా అనునది ఒక భాగమని యోగా తో మానసిక ప్రశాంత త తో పాటు ప్రశాంత జీవితం ను పొందవచ్చు అని యోగా క ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రత ను సాదించ వచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధాపకులు శ్రీనివాసరావు, దురోధన, శివకుమార్, మోహన రావు, ఆకష్, ఈశ్వర్, దేవరాజు, బృందావనం, సంతోష్ కుమార్ పాలోన్నరు.

## కేశుపురంలో పారిశుధ్య పనులు




**ఇచ్ఛాపురం, జూన్ 19 (వార్త):** కేశుపురం పంచాయతీ కేసుపురం, బిసి కొలని,సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ గ్రామంలోపరిసరాలు, కాలువలు పారిశుధ్యపనులు ఎంపిడిఓ ప్రభాకర్ కేసుపురం పంచాయితీ ప్రత్యేకాధికారి సూచన మేరకు పంచాయితీ కార్యదర్శి కోటేశ్వరరావు పర్యవేక్షణ లో పనులు చేపట్టరు.కూటమి నేతలు గుజ్జు బీమారాజు, పి. పురుషోత్తం, కె నరేంద్ర రెడ్డి, నీలాద్రి రెడ్డి, తిరుపతి, పాల్గొన్నారు. ఈ కార్యక్రమ లో ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి,కోటేశ్వరరావు,అధికారులు, హెల్త్ కేర్ డాక్టర్, వెట్నరీ డాక్టర్ చిన్నారావు, ఎ ఎన్ ఎం,ఆశావర్కర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జె.వై. విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

**-విద్యతో వ్యాపారం చేస్తున్న జె.వై. విద్యా సంస్థలను సీజ్ చేయాలి**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.హెచ్.రవి**



**పలాస, జూన్ 19 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో జె.వై. విద్యా సంస్థల యాజమాన్యలు అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్నారని, విద్యను మాఫియాగా దోపిడీ చేస్తున్న జె.వై విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి. హెచ్. రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి. హెచ్. రవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జెవై విద్యాసంస్థలకు అనుమతి లేకపోయినా తల్లితండ్రులకు టెక్నో, సి. బ్యాచ్, ఐపీఎల్ ,ఎంపి ఎల్, సీబీఎస్ఈ అని, మాయ మాటలు చెబుతూ తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మకూడదని ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ జిల్లా వ్యాప్తంగా పుస్తకాలకు టెక్నో సి బ్యాచ్, ఐకాన్, ఐపిఎల్, ఎంపిఎల్ గ్రూపుల పేర్లు ఏర్పాటు చేసుకొని 10వేల నుంచి 22 వేల వరకు పుస్తకాలను ఇంటికి డోర్ డెలివరీ చేస్తున్నారని రవి ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రూపులు కాకుండా విద్యార్థులలో భేదాలు వచ్చే విధంగా రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క గ్రూపుకు ఒక్కొక్క ఫీజు ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను క్రీడలు ఆడించకుండా కేవలం యంత్రాల్లాగా తయారు చేసే విధంగా జె.వై. విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒక్క బ్రాంచ్ కు కూడా క్రీడా మైదానం లేకుండా విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా జె.వై. విద్యా సంస్థలలో అర్హతలు, విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు సరైన విద్యార్హత కూడా లేదని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రిన్సిపాల్ సరైన ధ్రువపత్రాలు అందచేశారా.. లేదా.. అన్నది విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, తదితర స్టేషనరీ సామాన్లు విద్యా సంస్థలలోనే కొనుగోలు చేయాలని తల్లితండ్రులకు హుకుం జారీ చేస్తున్నారని, తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు జె.వై. విద్యా సంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కే సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# గాలివానకు తెగిన విద్యుత్ వైర్లు

**-సంజీవ్‌నగర్‌లో భయానక పరిస్థితులు..!**

**-రోడ్డుపై పడిన విద్యుత్ తీగలు.. కుక్క మృతి..**

**-గంటలపాటు ప్రజల్లో ఆందోళన..!**

**-ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు**

**- విద్యుత్ నిలిపివేత తర్వాతే ఊపిరి పీల్చుకున్న స్థానికులు..!**



**పలాస, జూన్ 19 (వార్త):** పలాస పట్టణంలోని సంజీవ్‌నగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. బలమైన గాలుల ధాటికి విద్యుత్ వైరు తెగి నేరుగా వీధి రోడ్డుపై పడిపోవడంతో కొంతసేపు ఆ ప్రాంతమంతా ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిన పరిస్థితి నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం సంజీవ్‌నగర్‌లో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల మధ్య దూరం అధికంగా ఉండడంతో విద్యుత్ తీగలు చాలా కాలంగా కిందికి వేలాడుతున్నాయి. కొన్ని చోట్ల ఒక స్తంభం నుంచి మరో స్తంభం వరకు దాదాపు 150 మీటర్ల మేర గ్యాప్ ఉండటంతో తీగలపై ఒత్తిడి పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వీచిన బలమైన గాలులకు ఒక విద్యుత్ వైరు తెగి నేరుగా రోడ్డుపై పడిపోయిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ వైరు రోడ్డుపై పడిన సమయంలో కరెంట్ సరఫరా నిలిపివేయకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. చిన్నారులు, వృద్ధులు, వాహనదారులు ఆ మార్గంలో సంచరించాల్సి ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించినప్పటికీ మొదట్లో ఎలాంటి స్పందన రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రోడ్డుపై పడివున్న విద్యుత్ తీగలను గుర్తించలేక అటుగా వెళ్తున్న ఓ వీధి కుక్క వాటిని తాకడంతో విద్యుత్ ఘాతానికి కుక్క మృత్యువాతకు గురైంది. కరెంట్ షాక్‌కు గురైన ఆ కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు మరింత భయాందోళనకు గురయ్యారు. మనుషులు ఎవరైనా ఆ వైర్లను తాకి ఉంటే మరింత పెద్ద ప్రమాదం జరిగేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన స్థానికులు నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. తెగిపడిన విద్యుత్ తీగలను తొలగించి మరమ్మతు పనులు చేపట్టారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక విద్యుత్ సరఫరాను పునఃప్రారంభించారు. ఘటనతో సంజీవ్‌నగర్‌లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నామని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాల మధ్య అధిక దూరం ఉండడం, తీగలు కిందికి వేలాడుతున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## తమిళ చిత్రం కడల్తాయ్‌లో
## పలాస వాసి కుమార్‌నాయక్

**పలాస, జూన్ 19 (వార్త):** కడల్తాయ్ తమిళ చలనచిత్రంలో పలాస వాసి నటుడిగా కుమార్ నాయక్ పాల్గొన్నారు. మున్నాభాయ్ నిర్వహణ సారథ్యంలో తమిళ చలనచిత్రంలో కడల్తాయ్ సినిమాను కాకినాడ పోర్టులో షూటింగ్లో పాల్గొంటున్న కుమార్ నాయక్. తమిళ్ చిత్రంలో మొదటిసారిగా పలాస వాసి కుమార్ నాయక్ పాల్గొనడంతో ఆ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

**-మద్యం సీసాలు స్వాధీనం - ఒకరి అరెస్టు**



**నరసన్నపేట, జూన్ 19(వార్త):** నరసన్నపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటప్పలనాయుడు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం రాత్రి అందిన సమాచారంతో నరసన్నపేట మండలంలోని బొరిగివలస ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పెద్దిని రాంబాబు వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన అనంతరం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెంకటప్పలనాయుడు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు సామాజిక సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈవో



**జలుమూరు, జూన్ 19(వార్త):** జలుమూరు మండలం దరివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు శుక్రవారం పరిశీలించారు. పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించి విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మమేకమైన ఎంఈవో, వారితో కలిసి నేలపై కూర్చొని పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. తెలుగు, గణితం, సాధారణ పరిజ్ఞానం తదితర అంశాలపై విద్యార్థుల ప్రతిభను పరిశీలించి వారికి ప్రోత్సాహం అందించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జనార్ధనరావుకు పలు సూచనలు చేసిన మాధవరావు, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని గుర్తించి వారికి తగిన బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేలా వినూత్న బోధనా పద్ధతులు అవలంబించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, అభ్యాస ఫలితాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా నైపుణ్యాల పెంపు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంఈవో మాధవరావు సూచించారు.

## ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**నరసన్నపేట, జూన్ 19(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కార్యక్రమంలో భాగంగా 75 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పవన్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా విద్యా సామగ్రిని అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించి కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు కూడా విద్యార్థులకు పుస్తకాల ప్రాధాన్యతను వివరించి, ప్రతి అంశాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా విద్యలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన



**నరసన్నపేట, జూన్ 19(వార్త):** నరసన్నపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ముందు హ్యాండ్‌వాష్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) శాంతారావు, పేడాడ దాలినాయుడు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పరిశుభ్రమైన చేతులతో ఆహారం తీసుకోవడం ద్వారా అనేక అంటువ్యాధులు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులను నివారించవచ్చని అధికారులు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు చిన్న వయస్సు నుంచే అలవరుచుకోవడం ద్వారా విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతారని పేర్కొన్నారు. పాఠశాలల్లో హ్యాండ్‌వాష్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించి విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

**నరసన్నపేట, జూన్ 19(వార్త):** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) పేడాడ దాలినాయుడు ఆదేశించారు. శుక్రవారం నరసన్నపేటలోని బోర్డు ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాల, భోజన నాణ్యత, మెనూ అమలు విధానాన్ని పరిశీలించిన ఎంఈవో, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని పేర్కొన్నారు. మెనూ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంటశాలలో పరిశుభ్రత పాటిస్తూ ఆహార పదార్థాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా



ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి తోడ్పాటునందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

# కిల్లాంకు పల్లెవెలుగు బస్సు సర్వీస్ పొడిగింపు

**- ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- గ్రామ ప్రజల దశాబ్దాల నాటి రవాణా సమస్యకు పరిష్కారం**



**నరసన్నపేట, జూన్ 19(వార్త):** నరసన్నపేట మండలం కిల్లాం గ్రామ ప్రజల చిరకాల రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. శ్రీకాకుళం-- మబగాం మధ్య నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) పల్లె వెలుగు బస్సు సర్వీసును కిల్లాం గ్రామం వరకు పొడిగిస్తూ ప్రారంభించారు. ఈ పొడిగించిన బస్సు సర్వీసును నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటివరకు శ్రీకాకుళం నుంచి మబగాం వరకు మాత్రమే బస్సు సౌకర్యం ఉండటంతో కిల్లాం గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మబగాం వద్ద బస్సు దిగి కిల్లాం చేరుకునేందుకు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలపై ఆధారపడాల్సి వచ్చేదని గ్రామస్తులు తెలిపారు. తాజాగా బస్సు సర్వీసు గ్రామం వరకు పొడిగించడంతో జిల్లా కేంద్రంతో నేరుగా అనుసంధానం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కిల్లాం గ్రామ ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఆర్టీసీ అధికారులతో చర్చించి ఈ సర్వీసును త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విద్య, ఉపాధి, వైద్యం వంటి అవసరాల కోసం రవాణా సౌకర్యం ఎంతో కీలకమని అన్నారు. బస్సు సర్వీసు ప్రారంభం సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల తమ ప్రయాణ కష్టాలు గణనీయంగా తగ్గనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి యాళ్ల వేణుగోపాలరావు, సర్పంచ్ ఆర్.బి. రామన్న, ఉపసర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ధర్మాన చిన్న మల్లేష్, ఆర్టీసీ డిపో మేనేజర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలపై అవమానకర వ్యాఖ్యలను మరిచిపోవడం శోచనీయం

**- టీడీపీ నేతల వైఖరిపై వైసీపీ మహిళా విభాగం విమర్శలు**

**- మహిళల గౌరవ పరిరక్షణలో ద్వంద్వ వైఖరి వద్దన్న జీవీ రమణి**



**నరసన్నపేట, జూన్ 19(వార్త):** మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తన జరిగిన సందర్భాలను విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం శోచనీయమని నరసన్నపేట నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షురాలు జీవీ రమణి విమర్శించారు. శుక్రవారం నరసన్నపేటలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల గౌరవం విషయంలో రాజకీయ పార్టీలన్నీ ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని, సందర్భానుసారంగా వైఖరులు మార్చుకోవడం సరైంది కాదని అన్నారు. గతంలో పలువురు టీడీపీ నాయకులు మహిళా నాయకులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, అలాంటి సంఘటనలపై స్పందించని వారు ఇప్పుడు మహిళల పరిరక్షణ గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళలను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన సందర్భాలను కూడా ప్రజలు మరచిపోలేదని పేర్కొన్నారు. స్థానికంగా కూడా మహిళలు సంక్షేమ పథకాల కోసం అధికారులను ఆశ్రయించే సమయంలో అవమానకర పరిస్థితులు ఎదుర్కొన్న ఘటనలు ఉన్నాయని ఆమె ఆరోపించారు. మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ, ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు. మహిళల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందని జీవీ రమణి పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడే విషయంలో అన్ని రాజకీయ పక్షాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా విభాగం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలమయమమైన రైల్వే అండర్‌పాస్



**జలుమూరు, జూన్ 19 (వార్త):** ఒకప్పుడు తిలారు జంక్షన్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రాంతం ప్రస్తుతం ప్రజలకు ఇబ్బందుల కేంద్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం అనంతరం చిన్నదుగాం, తిలారు, రావిపాడు తదితర గ్రామాల ప్రజలకు రైల్వే స్టేషన్‌కు చేరుకునేందుకు ప్రధాన మార్గంగా ఉన్న రైల్వే అండర్‌పాస్ ఇప్పుడు తీవ్ర సమస్యలకు నిలయంగా మారింది. వర్షాకాలం ప్రారంభమవుతుందంటే చాలు అండర్‌పాస్‌లో నీరు నిల్వ కావడం సాధారణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. స్వల్ప వర్షానికే అండర్‌పాస్ పూర్తిగా జలమయమై మోకాళ్ల లోతు వరకు నీరు చేరుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటిలో ప్రయాణించే క్రమంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు మధ్యలోనే నిలిచిపోతుండటంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అండర్‌పాస్‌లో నిలిచిపోయే నీటి కారణంగా వాహనాల ఇంజిన్లు మొరాయించి ఆర్థిక నష్టం వాటిల్లుతోందని వాహనదారులు వాపోతున్నారు. మరోవైపు వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు నీటిని దాటుకుని వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ఈ మార్గాన్ని ఉపయోగించడం ప్రమాదకరంగా మారిందని అంటున్నారు. ఈ సమస్యపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని ఆరోపిస్తున్నారు. అండర్‌పాస్‌లో నీరు నిల్వ కాకుండా తగిన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం, మోటార్ల ద్వారా నీటిని తొలగించే చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని అండర్‌పాస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ మార్గాన్ని సురక్షితంగా మార్చేందుకు తక్షణ చర్యలు అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు.

# గిరిజన రైతులకు పసుపు విత్తనాల పంపిణీ



**సారవకోట, జూన్ 19 (వార్త):** గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా సారవకోట మండలంలోని పలు గ్రామాల రైతులకు పసుపు విత్తనాలను ఉద్యానవన శాఖ పంపిణీ చేసింది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మంగమ్మ రైతులకు విత్తనాలు అందజేశారు. సీతంపేట ఐటీడీఏ ద్వారా మంజూరైన ఈ పథకం కింద 47 మంది గిరిజన రైతులకు పసుపు విత్తనాలతో పాటు స్ప్రేయర్లు, నీమ్ ఆయిల్ పంపిణీ చేశారు. కొండ ప్రాంతాల్లో పసుపు సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పసుపు సాగు ద్వారా మంచి దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. పసుపు సాగుకు సంబంధించిన సాంకేతిక సూచనలు, పంట సంరక్షణ చర్యలపై కూడా అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వం అందించిన సహాయంపై హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అభయాంజనేయ స్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే రమణమూర్తి

**- ప్రత్యేక పూజలు నిర్వహణ**

**- తీర్థప్రసాదాలు స్వీకరణ**

**- భక్తులతో కలిసి స్వామివారి దర్శనం**

**నరసన్నపేట, జూన్ 19(వార్త):** నరసన్నపేట మండలం నర్సింగిరాయుడుపేట గ్రామంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి వారి 9వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. గ్రామస్థుల ఆహ్వానం మేరకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందజేయగా, స్వామివారి తీర్థప్రసాదాలను ఆయన స్వీకరించారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, నరసన్నపేట పీఏసీఎస్ చైర్మన్ ఇసా అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి కన్నేపల్లి వెంకట లలితా ప్రసాద్, మాజీ సర్పంచులు పట్ట ప్రభాకర్, నాగేన సూరన్నాయుడు, దుల్ల ఆనంద్, కోట వెంకటరమణ, గుజ్జల దివాకరరావు, ముద్దాడ సింహాచలం తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. భక్తుల రద్దీ మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**శ్రీకాకుళం, జూన్ 19 (వార్త):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అధ్యక్షతన ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జేమ్స్ హాస్పిటల్, రాగోలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు చేతుల మీదుగా పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కిల్లి కృపారాణి, గాంధీ కుటుంబం దేశ రాజకీయాల్లో నీతి, నిజాయితీ, త్యాగానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అవినీతి, అక్రమాలపై పోరాటం వారి కుటుంబ ఆశయమని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువత సమస్యలను దేశవ్యాప్తంగా ప్రస్తావిస్తూ, వారి భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని ఆమె అన్నారు. దేశ యువతలో చైతన్యం నింపేందుకు ఆయన చేస్తున్న కృషికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, గాంధీ కుటుంబ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546